
సాక్షి
విశాఖపట్నం
శనివారం । 11 । మే । 2024



మారిన భీమిలి ముఖచిత్రం Xలో



'విశాఖ రాజధాని'కే ఓటు Xలో
రచ్చబండ



ప్రయాణికుల కోసం ప్రత్యేక రైళ్లు VIIIలో

నిజరూపం.. అపురూపం



పూలాలంకరణతో నృసింహస్వామి



క్యూలో ఉన్న భక్తులు

- వైభవంగా అప్పన్న చందనోత్సవం
- స్వామి నిజరూపాన్ని దర్శించి పరవశించిన భక్తజనం
- తెల్లవారుజాము 2.30 గంటల నుంచే సర్వదర్శనాలు ప్రారంభం
- స్వామిని దర్శించుకున్న శారదా పీఠాధిపతులు

సింహాచలం: వరాహ లక్ష్మీ నృసింహస్వామి నిజరూపం నేత్రపర్వంగా దర్శనమిచ్చింది. ఏడాదిలో ఒక్క రోజు మాత్రమే లభించే స్వామి నిజరూప దర్శనంతో భక్తులు పరవశులయ్యారు. వైశాఖ శుద్ధ తదియను పురస్కరించుకుని నిర్వహించిన అప్పన్న చందనోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి శుక్రవారం తెల్లవారుజామున ఒంటి గంట నుంచి ఆలయ అర్చకులు వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సుప్రభాతసేవ, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రుత్విగ్వరణం, కలశారాధన చేశారు. అనంతరం వెండి బొరుగుతో స్వామిపై ఉన్న పన్నెండు మణుగుల చందనాన్ని ఒలిచి నిజరూపభరితుడిని చేశారు.



క్యూలో వెళ్తున్న భక్తులు



ఆకట్టుకున్న స్వామి రూపం

పట్టువస్త్రాలు సమర్పించిన దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

చందనోత్సవాన్ని పురస్కరించుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్పెషల్ చీఫ్ సెక్రటరీ కరికల్ వలెవన్ పట్టువస్త్రాలు సమర్పించారు. స్వామిని దర్శించుకున్నారు. అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున స్వామికి పట్టువస్త్రాలను దేవస్థానం ప్రతినిధులు, వైదికులు సమర్పించారు.

తదుపరి విశేషపూజలు నిర్వహించారు. అనంతరం తెల్లవారుజామున 2.15 గంటల సమయంలో దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు కుటుంబసమేతంగా స్వామి తొలిదర్శనాన్ని చేసుకున్నారు. తెల్లవారుజామున 2.30 గంటల నుంచి ఉచిత, రూ.300, రూ.1000, రూ.1500 క్యూల్లో ఉన్న భక్తులకు దర్శనాలు కల్పించారు.

ప్రశాంతంగా దర్శనాలు : తోపులాటలు.. గంటల తరబడి నిరీక్షణ.. అసౌకర్యం అనే పరిస్థితేమీ లేకుండా అప్పన్న చందనోత్సవం ప్రశాంతంగా జరిగింది. భక్తులంతా స్వామిని తనివితీరా దర్శించుకుని, ఆనందం వ్యక్తం చేశారు. కలెక్టర్ ఎ.మల్లికార్జున, జేసీ మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, అదనపు కమిషనర్ విశ్వనాథన్ దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షించారు. గురువారం అర్ధరాత్రి నుంచే ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ అధికారులను అప్రమత్తం చేశారు. తెల్లవారు 4 గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభమవుతాయని ముందుగా ప్రకటించినా గంటన్నర ముందుగానే సర్వదర్శనాలు ప్రారంభించడం విశేషం. రూ.300 నుంచి రూ.1,500 టికెట్ క్యూ వద్ద పోలీస్ అధికారి, దేవస్థానం అధికారి, రెవెన్యూ అధికారిని ఏర్పాటు చేసి టికెట్లు పరిశీలన చేయించారు. సర్వదర్శనం వారికి సుమారు మూడున్నర గంటలు, రూ.300 టికెట్లు కలిగిన వారికి రెండు గంటలు, రూ.1000 టికెట్లు ఉన్న వారు గంటన్నరలోనే దర్శనం చేసుకోవడం విశేషం. రూ.1500 టికెట్లుపై వెళ్లినవారు అరగంటలోపే దర్శనం చేసుకుని తిరిగి వచ్చారు. మధ్యాహ్నం 12 గంటల సమయానికే 50 వేలకు పైగా భక్తులు స్వామి నిజరూపాన్ని దర్శించుకున్నారు. రాత్రి దర్శనాలు ముగిసేసరికి లక్షకు పైగానే భక్తులు వచ్చినట్లు అంచనా వేస్తున్నారు.

- 224 సీసీ కెమెరాలతో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు ప్రత్యేక పోలీసు బృందం పర్యవేక్షించింది. ఈవో వాటిని పరిశీలిస్తూ క్యూల్లో రద్దీ నెలకొనకుండా సిబ్బందికి సూచనలు అందించారు. సీపీ రవిశంకర్ ఆధ్వర్యంలో 3 వేల మంది పోలీసులను భద్రత కోసం వినియోగించారు. సింహగిరిపై బస్టాండ్‌లో, కొండ దిగువ గోశాల వద్ద, రెండో టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వర్తించారు.
- సింహగిరిపై దర్శనానంతరం అన్నప్రసాద భవనంలో భక్తులకు నిరంతరాయంగా దద్దోజనం, కదంబం అందజేశారు. దర్శనానంతరం దక్షిణ రాజగోపురం నుంచి నేరుగా అన్నదాన భవనానికి చేరుకుని అక్కడ నుంచి బస్టాండ్‌లోకి భక్తులు వెళ్లేలా ఈ సారి ఏర్పాటు చేశారు. కేవలం దేవస్థానం ఏర్పాటు చేసిన బస్సుల్లోనే సింహగిరికి భక్తులను రెండో ఘాట్ ద్వారా చేరవేశారు. తొలి ఘాట్‌ద్వారా కొండ దిగువకు చేర్చారు. పాత గోశాల వద్ద, పాత అడవివరం వద్ద ట్రాఫిక్‌ను పోలీసులు నియంత్రించారు.
- క్యూల్లో భక్తులకు ఇబ్బంది లేకుండా దేవస్థానంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశాయి. 169 ప్రాంతాల్లో తాగునీరు ఏర్పాటు, మజ్జిగ, బెల్లం పాకం, పులిహోర, దద్దోజనం, పొంగల్ ఏర్పాటు చేశారు.
- స్పెషల్ మెడికల్ క్యాంపుల ద్వారా కాళ్ల నొప్పులు, బీపీ, షుగర్ వంటి సమస్యలున్న భక్తులకు పీహెచ్‌సీ వైద్యులు , 108 అంబులెన్స్‌లు, సచివాలయ ఏఎన్ఎంలతో ఉచితంగా మందులు అందజేశారు.
- ఈవో శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో దేవస్థానం ఉద్యోగులు, పలు ఆలయాల నుంచి డిప్యుటేషన్‌పై నుంచి వచ్చిన ఉద్యోగులు విధులు నిర్వర్తించారు.

ఘనంగా సహస్ర ఘటాభిషేకం

రాత్రి సహస్ర ఘటాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాంచరాత్ర ఆగమశాస్త్ర పండితులు త్రిదండి చిన జీయర్‌స్వామి పర్యవేక్షణలో సింహగిరిపై ఉన్న గంగధార నుంచి వెయ్యి కలశాలతో శ్రీ వైష్ణవస్వాములు గంగా జలాలను తీసుకువచ్చారు. ఆ జలాలతో స్వామి నిజరూపాన్ని అర్చకులు అభిషేకించారు. అలాగే 108 వెండి కలశాలతో ఔషధ ద్రవ్యాలతో స్వామిని అభిషేకించారు. తదుపరి స్వామికి విశేషంగా పూజలు నిర్వహించి, తొలివిడతగా 120 కిలోల చందనాన్ని సమర్పించి మళ్లీ నిత్య రూపభరితుడిని చేశారు.



గంగధార నుంచి కలశాలతో జలం తీసుకువస్తున్న చిన్నజీయర్ స్వామి



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న కలెక్టర్ మల్లికార్జున



స్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు దంపతులు

స్వామిని దర్శించుకున్న ప్రముఖులు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిజరూపాన్ని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. విశాఖ శ్రీ శారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి, జస్టిస్ ఎ.వి.రవీంద్రబాబు, జస్టిస్ వి.శ్రీనివాస్, జస్టిస్ ఎం.కిరణ్మయి, దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, కలెక్టర్ మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, అదనపు కమిషనర్ విశ్వనాథం, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, సీపీ రవిశంకర్, ఎన్నికల అబ్జర్వర్ అమిత్ శర్మ తదితరులు దర్శించుకున్నారు.

అద్భుతంగా చందనోత్సవం: స్వరూపానందేంద్ర సరస్వతి

ఈ ఏడాది చందనోత్సవం అద్భుతంగా జరిగిందని విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి కొనియాడారు. దర్శనానంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గతేడాది జరిగిన లోటుపాట్లను సరిదిద్దుకుని ప్రభుత్వం పకడ్బందీగా ఏర్పాట్లు చేసిందన్నారు. పూర్తిగా సామాన్య భక్తులకే పెద్దపీట వేస్తూ ఈ సారి చందనోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం కూడా సింహాచలం క్షేత్రానికి వెళ్లే రోడ్లను వెడల్పు చేయడం చాలా అభినందనీయమన్నారు. దాదాపు 50 ఏళ్లుగా విస్తరణ జరగని రోడ్లను వెడల్పు చేసి, సింహాచలం క్షేత్రానికి వెళ్లే మార్గానికి నూతన శోభ చేకూర్చారన్నారు. దేవదాయశాఖ కమిషనర్, కలెక్టర్, దేవస్థానం ఈవోను అభినందించారు. రెండు తెలుగు రాష్ట్రాలూ ఈ ఏడాది ఆర్థికంగా, ఆయా రాష్ట్ర ప్రజలు ఆరోగ్యకరంగా, అన్నిరకాలుగా బాగుండాలని స్వామిని కోరుకున్నానని తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి, స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి

న్యూస్‌రీల్

కేజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్ సరెండర్

పలు ఆరోపణలపై డీఎంఈ విచారణ



కేజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి

మహారాణిపేట: కేజీహెచ్ గ్రేడ్ వన్ నర్సింగ్ సూపరింటెండెంట్ జె.విజయలక్ష్మిని పలు అభియోగాలపై సరెండర్ చేశారు. ఈ మేరకు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మిపై కొంతకాలంగా పలు ఆరోపణలు ఉన్నాయి. కేజీహెచ్ పరిధిలో నర్సుల డ్యూటీ రోస్టర్ సక్రమంగా వేయడం లేదని, కొంత మంది నర్సులకు నైట్ డ్యూటీ వేయడంలో నిబంధనలు పాటించడం లేదని, ఎక్కువగా విధులకు గైర్హాజరవుతున్నారని, నర్సింగ్ సూపరింటెండెంట్ పేరిట కార్యాలయంలో అనధికారి నర్సు విధులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలపై ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) డాక్టర్ నరసింహం ఇటీవల విచారణ చేపట్టారు. ఆ వెనువెంటనే ఆమెకు చార్జీ మోమో జారీ చేశారు. తాజాగా కేజీహెచ్ సూపరింటెండెంట్ ఆమెను డీఎంఈ కార్యాలయానికి సరెండర్ చేశారు. ఇన్‌చార్జి నర్సింగ్ సూపరింటెండెంట్‌గా గ్రేడ్–2 సూపరింటెండెంట్ కల్పన మౌళికి బాధ్యతలు అప్పగించారు.

ఎన్నికల నిర్వహణకు రూ.21 కోట్లు విడుదల

మహారాణిపేట: జిల్లాలో ఎన్నికల నిర్వహణకు రూ.21 కోట్లు విడుదలయ్యాయి. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, విశాఖ పార్లమెంట్ నియోజకవర్గానికి ఈ నెల 13న ఎన్నికలు నిర్వహిస్తున్న సంగతి విదితమే. ఇందుకోసం కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆధ్వర్యంలో రిటర్నింగ్ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే బ్యాలెట్ పత్రాల ముద్రణ, హోం ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పూర్తయింది.ఈ నెల 13కు అవసరమైన సామగ్రిని సిద్ధం చేస్తున్నారు. అన్ని పోలింగ్ స్టేషన్లలో తాగునీరు, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. కాగా.. 2019లో జిల్లాలో 15 అసెంబ్లీ నియోజకవర్గాలు, అనకాపల్లి, విశాఖ, అరకు పార్లమెంట్ స్థానాల ఎన్నికల నిర్వహణకు రూ.40 కోట్లు విడుదలయ్యాయి.

నేటితో ప్రచారానికి తెర

- రెండు నెలలుగా ఓటర్ల వెంట అభ్యర్థులు
- అడుగడుగునా కోడ్ ఉల్లంఘించిన టీడీపీ, బీజేపీ, జనసేన అభ్యర్థులు
- ఓటుకు రూ.2 వేల నుంచి 3 వేల వరకు పంపిణీ
- ఓటమి భయంతో అడ్డదారులు తొక్కిన పచ్చ నేతలు



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

జిల్లాలో పోలింగ్ కేంద్రాల సంఖ్య	1991
విశాఖ పార్లమెంట్ పరిధిలో పోలింగ్ కేంద్రాల సంఖ్య	1962
జిల్లాలో సమస్యాత్మక కేంద్రాలు	0
క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు	502
విశాఖ పార్లమెంట్ పరిధిలో క్రిటికల్ కేంద్రాలు	497

సాక్షి, విశాఖపట్నం: ఎన్నికల ప్రచారానికి శనివారంతో తెరపడనుంది. దాదాపు రెండు నెలలుగా 'ఫలానా అభ్యర్థికే మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించ ప్రార్థన' అంటూ ప్రచార వాహనాలు వార్డులు, వీధుల్లో హోరెత్తిస్తున్నాయి. ప్రధాన పార్టీల అభ్యర్థుల వాహనాలు పోటా పోటీగా తిరుగుతున్నారు. ఆయా పార్టీల అధినేతలు రోడ్డు షోలు, బహిరంగ సభలు నిర్వహించగా, అభ్యర్థులు ర్యాలీలు, కార్నర్ మీటింగ్‌లు ఏర్పాటు చేశారు. ఓటర్లను ఆకట్టుకోవడానికి అభ్యర్థులు మటన్ కొట్టడం, బజ్జీలు వేయడం, ఇస్త్రీ చేయడం , చేపలు పట్టడం, తాటి ముంజెలు కొట్టడం వంటి పనులు చేశారు. సోమవారం పోలింగ్ జరగనుండడంతో నిబంధనల ప్రకారం రెండు రోజుల ముందే ప్రచారాన్ని ముగించాల్సి ఉంటుంది. దీంతో శనివారం సాయంత్రం ఆరు గంటల వరకే ప్రచారానికి అనుమతి ఉంది. ఆపై మైకులు మూగబోనున్నాయి. ప్రచార రథాలకు బ్రేకులు పడనున్నాయి. ఈ నేపథ్యంలో బరిలో నిలిచిన అభ్యర్థులు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రజాదరణతో ఆ పార్టీ అభ్యర్థులు గెలుపు దిశగా దూసుకుపోతుండడంతో ఈ సారి టీడీపీ, బీజేపీ, జనసేన అభ్యర్థుల గెలుపు చావోరేవో అన్నట్టుగా తయారైంది. ఓటమి భయంతో అన్ని అడ్డదారులూ తొక్కుతున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి, ప్రలోభ పెట్టడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే వీరు మహిళా ఓటర్లకు చీరలు, వెండి కుంకుమ భరిణలు, బంగారు నల్లపూసలు, పురుష ఓటర్లకు దుస్తులు, వస్త్రాలు వంటివి విరివిగా పంపిణీ చేపట్టారు. పోలింగ్ తేదీ సమీపిస్తుండడంతో ఓటుకు రూ. 2వేల నుంచి 3 వేల వరకు నగదు ఇస్తున్నారు. మరికొందరికి ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎంల ద్వారా ఆన్‌లైన్ పేమెంట్లు చేస్తున్నారు. ఇలా ఇప్పటికే రూ.కోట్లను మంచినీళ్లలా కుమ్మరించారు. ఇంకా మందుబాబులకు మద్యం పంపిణీని ఏరులై పారించారు. పోలింగ్‌కు కేవలం రెండు రోజులు మాత్రమే సమయం ఉండడంతో వీరు ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఇన్ని రోజులు సాగిన ప్రచారం ఒక ఎత్తయితే ఆఖరి ఈ రెండు రోజుల పోలింగ్ నిర్వహణ కోసం చేసే కసరత్తు మరొక ఎత్తుగా భావిస్తున్నారు. నగదు, ఇతర తాయిలాల పంపిణీలో ప్రత్యర్థులు, నిఘా అధికారులకు దొరకకుండా ఎత్తుగడలు వేస్తున్నారు. ఓ వైపు ప్రలోభాలకు తెరతీస్తూనే మరోవైపు పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించారు. బూత్‌ల వారీగా ఎన్నికల ఏజెంట్ల నియామకంపైనా తలమునకలయ్యారు. ఇప్పటికే చాలావరకు ఓటర్లకు స్లిప్పుల పంపిణీ పూర్తి చేశారు.

నియోజకవర్గాల వారీగా బరిలో ఉన్న అభ్యర్థుల సంఖ్య	
విశాఖ పార్లమెంట్	33
ఎస్.కోట	14
భీమిలి	17
విశాఖ తూర్పు	15
విశాఖ దక్షిణ	19
విశాఖ ఉత్తర	17
విశాఖ పశ్చిమ	16
గాజువాక	14
పెందుర్తి	19

మద్యం షాపులన్నీ శనివారం సాయంత్రం నుంచి మూసి వేయనున్నారు. దీంతో బీజేపీ, జనసేన, టీడీపీ అభ్యర్థులు ముందు జాగ్రత్తగా పెద్ద ఎత్తున నిల్వ చేసుకున్నారు. ప్రచార శిబిరాల వద్ద పచ్చ కార్యకర్తలు మద్యంలో మునిగి తేలుతున్నారు.

అమలులో 144 సెక్షన్

పోలింగ్ ముగింపునకు 48 గంటల ముందు నుంచి సైలెంట్ పీరియడ్ అమలవుతున్నందున 144 సెక్షన్ అమలులో ఉంటుందని కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ప్రతి అభ్యర్థి ఎన్నికల నియమావళికి లోబడి వ్యవహరించాలన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్‌లో అభ్యర్థులతో సమావేశమయ్యారు. ఆయా నియోజకవర్గాల్లో బయట వ్యక్తులు ఉండకూడదని, 72 గంటల కాలంలో పోలీసు, ఎంసీసీ బృందాలు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని లాడ్జిలు, హోటళ్లు, కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లు తనిఖీ చేస్తాయని చెప్పారు. అనుమానిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటారన్నారు. రాజకీయ బోర్డులు, పోస్టర్లు తొలగించాలని, పోలింగ్ ఏజెంట్ల వివరాలను పీవోలకు అందజేయాలని సూచించారు. ఒపీనియన్ పోల్స్ నిర్వహించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. పోలింగ్ రోజున 200 మీటర్ల పరిధిలో ఇతరులు ఉండరాదన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు 1+2, స్వతంత్ర అభ్యర్థులు 1+1 వాహనాలు వినియోగించుకోవచ్చన్నారు. ఓటరు స్లిప్ తీసుకోని వారు పోలింగ్ రోజున తీసుకుని నేరుగా ఓటు వేయొచ్చని కలెక్టర్ తెలిపారు.

ఐటీతో రాజకీయ కుట్ర

- టీడీపీ, బీజేపీ, జనసేనల్లో ఓటమి భయం
- వైఎస్సార్ సీపీ అభ్యర్థులపై ఐటీ అస్త్రం
- వారి కదలికలపై నిఘా, సన్నిహితుల ఇళ్లపై దాడులు
- ప్రచారాలకు సహకారం అందకుండా అడ్డుకునే ప్రయత్నం

విశాఖ సిటీ : ఆ మూడు పార్టీలకు ఓటమి భయం పట్టుకుంది. వచ్చే ఎన్నికల్లో సైతం పరాభవం తప్పదని తెలిసిపోయింది. రాష్ట్రంలో సర్వే సంస్థలన్నీ ఇప్పటికే ప్రజానాడిని స్పష్టం చేశాయి. ప్రజలు మరోసారి వైఎస్సార్ సీపీకే పట్టం కడుతున్న విషయాన్ని తేటతెల్లం చేస్తూ సర్వే ఫలితాలను ప్రకటించాయి. ఈ క్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన కుటిల పన్నాగానికి తెరలేపాయి. ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థులను నియంత్రించడానికి ఐటీ అస్త్రాన్ని ప్రయోగిస్తున్నాయి. కర్ర ఉన్న వాడిదే బర్రె అనే తంతుగా సరిగ్గా ఎన్నికలకు ముందు అభ్యర్థుల సన్నిహితుల ఇళ్లు, కార్యాలయాల్లో దాడులు చేయిస్తున్నాయి. ప్రచారాలకు సహకారం అందకుండా అధికార పార్టీ అభ్యర్థులను మానసికంగా కట్టడి చేసేందుకు కుట్ర పన్నుతున్నాయి. తాజాగా విజయావకాశాలు ఎక్కువగా ఉన్న విశాఖ ఉత్తర వైఎస్సార్ సీపీ అభ్యర్థి కె.కె.రాజు స్నేహితుల ఇళ్లపై ఐటీ అధికారులు దాడులు చేయడం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.

ఓటమి భయంతో ఉసిగొల్పి..

వైఎస్సార్ సీపీ ఆవిర్భావానికి ముందు విశాఖ జిల్లా టీడీపీకి కంచుకోటగా ఉండేది. 2019 ఎన్నికల్లో నగరంలో నాలుగు నియోజకవర్గాలు మినహా 11 స్థానాలను వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంది. ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ గతంలో గెలుచుకున్న నాలుగు స్థానాలను కోల్పోయే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీంతో ఓటమి భయంతో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అడ్డుకోవడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. పోలింగ్‌కు సమయం సమీపిస్తున్న తరుణంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల ప్రచారాలను నియంత్రించేందుకు ఐటీ చక్ర బంధంలో ఇరికించే ప్రయత్నాలు చేస్తున్నారు.

కేకే రాజు స్నేహితుల ఇళ్లలో ఐటీ తనిఖీలు

వైఎస్సార్ సీపీ అభ్యర్థి కె.కె.రాజుకు నియోజకవర్గంలో ప్రజల మద్దతు లభిస్తోంది. 2019 ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందినా ప్రజలకు అందుబాటులోనే ఉంటూ వచ్చారు. ఇక్కడి నుంచి గెలిచిన టీడీపీ నేత గంటా శ్రీనివాసరావు మాత్రం ఒక్కసారి కూడా నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి దారుణంగా మారింది. ఈ క్రమంలో ఈ స్థానాన్ని చంద్రబాబు బీజేపీకి కేటాయించారు. ఇక్కడి నుంచి బీజేపీ అభ్యర్థిగా విష్ణుకుమార్‌రాజు ఎన్నికల బరిలో ఉన్నారు. అతడు 2014లో ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ నియోజకవర్గానికి చేసిందేమీలేదు. దీంతో నియోజకవర్గం ప్రజలు అతడిని విశ్వసించే అవకాశాలు లేవు. ఇదిలా ఉంటే రెండు రోజుల క్రితమే స్థానిక జనసేన నాయకులు, వార్డు అధ్యక్షులు విష్ణుకుమార్ రాజుకు వ్యతిరేక స్వరాన్ని వినిపించారు. బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు నిర్వహించిన సమన్వయ సమావేశంలో జనసేన నాయకులు విష్ణుకుమార్‌రాజుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో అతడికి సహకరించబోమని తేల్చి చెప్పి సమావేశం నుంచి వెళ్లిపోయారు. దీంతో అతడి విజయావకాశాలు పూర్తిగా సన్నగిల్లాయి. ఈ క్రమంలో కె.కె.రాజు స్నేహితులైన అయిదుగురి ఇంటిపై ఐటీ దాడులు చేయడం గమనార్హం. చంద్రబాబు కుట్రలో భాగంగానే బీజేపీ పెద్దలు కె.కె.రాజును అడ్డుకోవడానికి ఐటీ అధికారులను ఉసిగొల్పినట్టు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

స్టీల్‌ప్లాంట్‌పై ప్రకటన చేస్తే పోటీకి దూరం

వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్



స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగులకు అభివాదం చేస్తున్న బొత్స ఝాన్సీ, అమర్‌నాథ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తే ఇప్పుడే తాము పోటీ నుంచి తప్పుకుంటామని వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉక్కు హిల్‌టాప్ కూడలి వద్ద శుక్రవారం జరిగిన సభలో వారు ఉద్యోగులనుద్దేశించి ప్రసంగించారు. ఎన్నికలకు రెండు రోజులు మాత్రమే వ్యవధి ఉన్నందున వెంటనే కూటమి తమ నిర్ణయం ప్రకటించాలన్నారు. అమర్‌నాథ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల గాజువాక సభలో చెప్పినట్టు కూటమికి ఓటేస్తే ప్రైవేటీకరణకు అంగీకరించినట్టేనని చెప్పారు. 1180 రోజులుగా కార్మికులు ఆందోళ చేస్తున్నా కేంద్రం స్పందించలేదన్నారు. మంత్రి హోదాలో తాను కూడా నిరసన శిబిరానికి మద్దతు తెలిపినట్టు గుర్తు చేశారు. బొత్స ఝాన్సీ మాట్లాడుతూ తాను బొబ్బిలి ఎంపీగా ఉన్నప్పుడు ప్లాంట్ 3 వేల కోట్లు నష్టాలతో ఉంటే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రప్పించామన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉంటే ప్లాంట్‌ను తప్పకుండా కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, గురుమూర్తిరెడ్డి, నాయకులు ఉరుకూటి అప్పారావు, మంత్రి రాజశేఖర్, వై.మస్తానప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎలక్షన్ స్పెషల్స్!

- పోలింగ్ దృష్ట్యా ప్రత్యేక బస్సులు
- విశాఖ నుంచి 50 బస్సులు సిద్ధం



సాక్షి, విశాఖపట్నం: సార్వత్రిక ఎన్నికలకు ఈనెల 13న పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ఈ బస్సులను ప్రయాణికులతో పాటు పోలింగ్ సిబ్బంది కోసం సిద్ధం చేస్తున్నారు. అలాగే ఈ బస్సులను ఎన్నికల సామగ్రిని ఒక పోలింగ్ స్టేషన్ నుంచి మరో స్టేషన్‌కు తరలించడానికి కూడా వినియోగించనున్నారు. విశాఖ జిల్లాకు సంబంధించి ఎక్కువ బస్సులను ఉపయోగించాల్సిన అవసరం ఉన్నందున నగరంలో తిరిగే సిటీ బస్సులను కేటాయించనున్నారు. అందువల్ల ఈనెల 12, 13 తేదీల్లో నగరంలో ప్రయాణించే సిటీ బస్సులు అందుబాటులో ఉండవని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఓటర్లు, ప్రయాణికుల సౌకర్యార్థం అంతర జిల్లాల ఆర్టీసీ బస్సులు యథావిధిగా నడుపుతామని స్పష్టం చేశారు. 13వ తేదీన పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి వారికి కేటాయించిన ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచుతున్నారు. విశాఖపట్నం నుంచి చోడవరం, మాడుగుల, అనకాపల్లి, యలమంచిలి, పాయకరావుపేట, నర్సీపట్నం నియోజకవర్గాలకు 12వ తేదీ ఉదయం 4 గంటల నుంచే విశాఖ ద్వారకా బస్‌స్టేషన్ నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ఆరోజు ఉదయం 4 గంటలకు చోడవరానికి 30 బస్సులు, మాడుగులకు 8, అనకాపల్లి, యలమంచిలికి 4, పాయకరావుపేటకు 4, నర్సీపట్నం నాలుగు బస్సులు చొప్పున వెరసి 50 బస్సులను నడుపుతున్నట్టు ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.అప్పలరాజు తెలిపారు.

వైఎస్సార్ సీపీ గెలిస్తేనే విశాఖ రాజధాని

- సీఎం జగన్ ప్రయత్నాన్ని అడ్డుకోవడమే టీడీపీ, బీజేపీ, జనసేన పని
- సిటిజన్ ఫోరం సదస్సులో అభిప్రాయపడ్డ మేధావులు


మేధావుల సదస్సులో మాట్లాడుతున్న సిటిజన్ ఫోరం కార్యదర్శి వెంకటేశ్వరరావు

గోపాలపట్నం: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వస్తే విశాఖ రాజధాని అవుతుందని పలువురు మేధావులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆర్అండ్‌బీ జంక్షన్ వద్ద మారియట్ హోటల్‌లో శుక్రవారం సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో మేధావుల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సిటిజన్ ఫోరం కార్యదర్శి వెంకటేశ్వరరావు బెనర్జీ మాట్లాడుతూ విశాఖలోని స్టీల్‌ప్లాంట్‌తో సహా పలు పరిశ్రమలను పోరాటాలతోనే సాధించుకున్నామన్నారు. పోర్టు వల్ల పర్యావరణ సమస్యలు, స్టీల్ ప్లాంట్ నిర్వాసితుల సమస్యలు విశాఖను పట్టిపీడిస్తున్నాయని చెప్పారు. ఇవి పరిష్కారం కావాలంటే వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం అనివార్యమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విశాఖను రాజధాని చేయాలని ప్రయత్నిస్తుంటే.. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు అడుగడుగునా అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. విశాఖ రాజధానైతే పారిశ్రామిక అభివృద్ధితోపాటు ఐటీ, సాఫ్ట్‌వేర్ కంపెనీలు వస్తాయని, తద్వారా ఉత్తరాంధ్ర వాసులకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీని గెలిపించుకుందాం

జిల్లాలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. తన తండ్రి ఆశయాలకనుగుణంగా విద్య, వైద్యం కోసం సొంత నిధులు వెచ్చిస్తున్న వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్, విశాఖ వాణిని పార్లమెంట్‌లో ఇప్పటికే వినిపించిన వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ లక్ష్మిని గెలిపించుకోవాలని కోరారు. ఐటీఐ రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎల్.బి.రాజేంద్రప్రదేశ్ మాట్లాడుతూ దివంగత ఆడారి తులసీరావు విశాఖ డైరీ ద్వారా ఎంతో మంది రైతులకు ప్రత్యక్షంగా.. పరోక్షంగా సాయపడ్డారని, రైతుల ఆర్థికాభివృద్ధికి పాటుపడ్డారని కొనియాడారు. వైఎస్ ప్రసాద్ మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి కులం,మతం అని చూడకుండా సంక్షేమ పథకాలు అందరికి అందించారన్నారు. ప్రజలంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. యూసీసీ అడ్వయిజర్ జ్ఞాన్ ప్రకాష్ మాట్లాడుతూ విశాఖ రాజధాని అయితే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందన్నారు. యూసీసీ వైస్ ప్రెసిడెంట్ ఎస్.అంథోని మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో వలసలు తగ్గాలంటే విశాఖ రాజధాని కావాలన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మోరు, శ్రీధర్, యూసీసీ ట్రెజరర్ సెబాస్టియన్ తదితరులు పాల్గొన్నారు.

పంచకర్ల మైనింగ్ డాన్

- రాంబిల్లి కొండపై అక్రమ తవ్వకాలు
- 2019లో పంచకర్లపై నిప్పులు చెరిగిన జనసేన అధినేత పవన్
- అదే పంచకర్లకు జనసేన సీటు
- మళ్లీ పెందుర్తిలో చెలరేగిపోతున్న పంచకర్ల గ్యాంగ్



పెందుర్తి: ''యలమంచిలి టీడీపీ ఎమ్మెల్యేగా పనిచేసిన పంచకర్ల రమేష్‌బాబు భారీ ఎత్తున అక్రమ తవ్వకాలకు పాల్పడ్డాడు. యలమంచిలి, అచ్యుతాపురం ప్రాంతాల్లో అక్రమ మైనింగ్ చేసి రోజుకు రూ.6 లక్షలు సంపాదించాడు. ప్రజా సమస్యలను గాలికొదిలేసి దోపిడీలు, దందాలకు పాల్పడ్డాడు. ఇలాంటి వ్యక్తినా మీరు గెలిపిస్తారు.. రమేష్‌బాబు లాంటి అవినీతి పరుడ్ని గెలిపించి మీరు చాలా తప్పు చేశారు''.. ఈ మాటలు అన్నది ఎవరో కాదు 2019 ఎన్నికల ప్రచారంలో జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్.

యలమంచిలి టీడీపీ ఎమ్మెల్యేగా పనిచేసిన ప్రస్తుత జనసేన పెందుర్తి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు ఐదేళ్ల పాటు యలమంచిలిని దోచుకున్నాడని 2019 ఎన్నికల ప్రచార సమయంలో పవన్ కల్యాణ్ ఆరోపించారు. అదే పంచకర్లకు పెందుర్తిలో పవన్ కల్యాణ్ సీటు ఇచ్చారు. దీంతో ఇక్కడి నేతలు పవన్ కల్యాణ్ అప్పట్లో పంచకర్లపై చేసిన విమర్శలను గుర్తు చేసుకుంటున్నారు.

అక్రమాలే అజెండా

రాజకీయాల్లో వలస పక్షిగా ముద్ర వేసుకున్న పంచకర్ల రమేష్‌బాబు టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు యలమంచిలిలో అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారు. పవన్ కల్యాణ్ లెక్క ప్రకారం రోజుకు రూ.6 లక్షలు చొప్పున ఐదేళ్లలో రూ.కోట్లలో సంపాదించారని చెప్పినా.. రాంబిల్లిలోని పంచదార్ల కొండను పిండి చేసి అంతకు మించి దోచుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాటు అచ్యుతాపురం, రాంబిల్లి ప్రాంతాల్లో కంపెనీల ఏర్పాటు సమయంలో భూములు ఇచ్చిన రైతులకు పరిహారం విషయంలో పంచకర్ల, అతని అనుచరులు చేతివాటం ప్రదర్శించారు. తప్పుడు పత్రాలతో బినామీలను సృష్టించి రైతులకు అందాల్సిన పరిహారాన్ని పంచకర్ల గ్యాంగ్ కాజేశారని స్వయంగా యలమంచిలి టీడీపీ నాయకులే ఆరోపించారు. అప్పట్లో స్థానిక టీడీపీ నాయకులను పక్కన పెట్టి మండలానికో షాడో పంచకర్లను తయారు చేసి ఆయా దందాలకు పాల్పడినట్లు టీడీపీ వర్గాలే చెబుతున్నాయి.

ఆగడాలు అప్పటి నుంచే..

2009లో ప్రజారాజ్యం తరపున పెందుర్తి ఎమ్మెల్యేగా గెలిచిన పంచకర్ల రమేష్‌బాబు ఆ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసిన తర్వాత 2011 నుంచి అధికార పార్టీ ఎమ్మెల్యేగా అవతారం ఎత్తారు. ఆ క్షణం నుంచే పంచకర్ల, అతని అనుచరుల అసలు రూపం బయటకు వచ్చింది. అధికారులను తమ దారికి తెచ్చుకుని రౌడీయిజంతో పాటు భూ కబ్జాలకు పాల్పడ్డారు. పెందుర్తి కేంద్రంగా ఎన్నో దందాలకు పాల్పడ్డారు. ఆ సమయంలో పంచకర్ల అనుచరుడు ఒకరు ఏకంగా పోలీసుల భూమికే గురి పెట్టాడు. పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉన్న ఖాళీ స్థలాన్ని పోలీస్ క్వార్టర్ల నిర్మాణానికి కేటాయించారు. అప్పటి పంచకర్ల అనుచరుడు గొర్లె అప్పారావు దానిపై కన్నేశాడు. తప్పుడు డాక్యుమెంట్‌లు సృష్టించి ఏకంగా పోలీసులకు కేటాయించిన స్థలాన్నే ఆక్రమించుకునేందుకు ప్రయత్నం చేశాడు. దీంతో అప్రమత్తమైన అప్పటి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షేక్ హుస్సేన్ అప్పారావుపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి ఆట కట్టించారు. అప్పట్లో రమేష్‌బాబు పేరు చెప్పుకుని సెటిల్‌మెంట్లు చేయడం, బెదిరింపులకు పాల్పడం వంటి ఘటనలు కోకొల్లలు. ఒక రకంగా చెప్పాలంటే పెందుర్తి నియోజకవర్గంలో రౌడీయిజానికి పంచకర్ల రమేష్‌బాబు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే అని రాజకీయ విశ్లేషకులు చెబుతారు.

అనుచరుల రౌడీయిజం

ఈ ఏడాది ఏప్రిల్ 14న జీవీఎంసీ 88వ వార్డు సతివానిపాలెంలో జరిగిన విందు కార్యక్రమంలో టీడీపీ కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడుపై పంచకర్ల రమేష్ అనుచరుడు గల్లా శ్రీనివాసరావు దాడికి పాల్పడ్డాడు. స్థానికులు వచ్చి అడ్డుకోవడంతో ముత్యాలనాయుడు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. బాధిత కార్పొరేటర్ పెందుర్తి పోలీసులను ఆశ్రయించారు. ఇలా పెందుర్తి నియోజకవర్గంలో జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు అనుచరుల రౌడీయిజం పెచ్చుమీరుతోంది. తమకు నచ్చని వారిపై హత్యాయత్నాలు, భౌతికదాడులకు పాల్పడుతున్నారు. ప్రత్యర్థులను సోషల్ మీడియా వేదికగా అసభ్యపదజాలంతో దూషిస్తున్నారు. కులాల పేరుతో వేధిస్తున్నారు. 'మేం వస్తే మీ సంగతి తేలుస్తాం' అంటూ బెదిరింపులకు పాల్పడుతుండడంపై ఇక్కడి ప్రజలు ఆందోళన వెలిబుచ్చుతున్నారు. ఇలాంటి నాయకుడికి ఓటుతోనే చెక్ పెట్టాలని రాజకీయ విశ్లేషకులు, పెందుర్తి ఓటర్లు అభిప్రాయపడుతున్నారు.

మళ్లీ పంచకర్ల గ్యాంగ్ హడావుడి

పెందుర్తి ఎమ్మెల్యేగా జనసేన నుంచి పోటీ చేస్తున్న పంచకర్ల రమేష్‌బాబు అనుచరులు ఆగడాలు మొదలు పెట్టారు. 2023 నవంబర్ 12 దీపావళి రోజు పెందుర్తి మండలం చింతగట్ల సర్పంచ్ భర్త, రాష్ట్ర అయ్యారక వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ గనిశెట్టి కనకరాజుపై జనసేన నాయకులు రెచ్చిపోయారు. బీరు బాటిళ్లు..పదునైన ఆయుధాలతో కనకరాజుపై దాడికి పాల్పడ్డారు. స్థానికులు స్పందించి రక్తపు మడుగులో ఉన్న కనకరాజును ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. జనసేన నాయకులు మాడిన హరీష్, చందక గోవిందరాజు, దాసరి గణేష్‌లను నిందితులుగా గుర్తించి పెందుర్తి పోలీసులు ఈ ఏడాది ఏప్రిల్ 2న అరెస్ట్ చేశారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ సందర్శన


కమాండ్ కంట్రోల్ రూమ్‌లో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కలెక్టరేట్ మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను శుక్రవారం సాయంత్రం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున సందర్శించారు. జిల్లాలోని క్లిష్టతరమైన పోలింగ్ కేంద్రాల్లో అమర్చుతున్న వెబ్ కాస్టింగ్ ప్రక్రియను డ్యాష్ బోర్డు ద్వారా పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ పెట్టారు.. ఇంకా ఎన్ని చోట్ల పెట్టాల్సి ఉందని అక్కడ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిర్వహణకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిర్ణీత సమయంలో వాటన్నింటినీ అమర్చాలని, కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాలని సూచించారు. డ్యాష్ బోర్డు సహాయంతో కొన్ని కేంద్రాల వద్ద అమర్చిన కెమెరాలను ఆయన స్వయంగా పరిశీలించి, అక్కడి పరిస్థితిని గమనించారు.

ఓటమి భయంతోనే కలిసి పోటీ

- టీడీపీ, జనసేన, బీజేపీని ప్రజలు నమ్మడం లేదు
- వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి
- పరిపాలన రాజధానితోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


నగరంపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ : ఓటమి భయంతోనే టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీ చేస్తున్నాయని వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి అన్నారు. శుక్రవారం సాయంత్రం జీవీఎంసీ 5, 7 వార్డుల పరిధిలోని బాపూజీనగర్, స్వతంత్రనగర్, టైలర్స్ కాలనీ, శ్యాంనగర్, గణేష్‌నగర్, నగరంపాలెం, మధురవాడ ది అడ్రస్ గేటెడ్ కమ్యూనిటీ పరిసర ప్రాంతాల్లో ఆమె, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్ నాయకత్వాన్ని బలపరిస్తే పిల్లలకు ఉజ్వల్ భవిష్యత్ వుంటుందన్నారు. విజన్ విశాఖలో భాగంగా విశాఖ నగరాన్ని లక్ష కోట్ల రూపాయలతో సీఎం జగన్ అభివృద్ధి చేయనున్నారని తెలిపారు. మధురవాడలో రూ.202 కోట్లతో ఐటీ టవర్స్ నిర్మిస్తారన్నారు. విశాఖ పరిపాలన రాజధాని అయితే 150 రాష్ట్ర స్థాయి కార్యాలయాలు ఇక్కడకు వస్తాయని, ఈ ప్రాంతం అంతా అభివృద్ధి చెందుతుందన్నారు. బీచ్, ఐటీతోపాటు టెక్ మహీంద్ర, అమెజాన్, ఎస్ గ్లోబల్ వంటి వాటితో యువతకు విద్య, ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయన్నారు. విశాఖ పరిపాలన రాజధాని అయితే ఉత్తరాంధ్ర మరింత అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఎన్నికలప్పుడే కనిపించే నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. నగరాలు కమ్యూనిటీని దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి బీసీ డీ జాబితాలో చేరిస్తే..., సీఎం జగన్ మోహన్‌రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతిన హనుమంతురావు, నాయకులు వంకాయల మారుతీ ప్రసాద్, బంగారు ప్రకాశ్, పసుపులేటి గోపి, తమ్మినేని వరలక్ష్మి, పెంటి అప్పన్న, బెల్లాపు పాపారావు, నెంబర్ రమణమ్మ, నాగమ్మ, చేకూరి రజని, వాండ్రసి రవికుమార్, నాగోతి చిన్న, ఎస్.బాబ్జి, బండారు శివలక్ష్మి, నిమ్మకాయల గణేష్, కూన రమణ, బగాది లక్ష్మణ, ఎమ్.రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం వ్యతిరేకి చంద్రబాబు

- రిజర్వేషన్లు రద్దు చేస్తామన్న బీజేపీతో ఎలా పొత్తుపెట్టుకున్నారు
- కిరాయిలతో కలిసి సీఎం జగన్‌పై తప్పుడు ప్రచారం
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు ఐహెచ్ ఫరూఖీ


మాట్లాడుతున్న ఐ.హెచ్.ఫరూఖీ

విశాఖ సిటీ: ముస్లింలను అన్ని విధాలుగా అణిచివేయడానికి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కుట్రలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు ఐ.హెచ్.ఫరూఖీ ఆరోపించారు. శుక్రవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు నగర టీడీపీ కార్యాలయంలో కొంత మంది కిరాయి ముస్లింలను వెంటబెట్టుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మీయ సమావేశానికి మీడియాకు అనుమతినివ్వకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ముస్లింల రిజర్వేషన్లు రద్దు చేస్తామన్న బీజేపీతో పొత్తుపెట్టుకున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్ పొంతన లేని సమాధానం చెబుతూ ముస్లింలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. 45 ఏళ్ల అనుభవం ఉందంటూ గొప్పలు చెప్పుకుంటున్న చంద్రబాబు ముస్లింల సంక్షేమానికి ఏం చేశారని ప్రశ్నించారు. బీజేపీ అధికారంలోకి వస్తే ముస్లింల రిజర్వేషన్ రద్దు చేస్తామన్న ప్రకటనపై ఇప్పటి వరకు చంద్రబాబు ఎందుకు స్పందించలేదన్నారు. గతంలో కూటమిగా ఏర్పడి.. బాబు వస్తే జాబు వస్తుందన్న చంద్రబాబు.. ఎంతమంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చారు.. అందులో ముస్లింలు ఎంతమంది ఉన్నారో చెప్పాలని ప్రశ్నించారు. బీజేపీతో పొత్తు పెట్టుకున్నప్పుడే చంద్రబాబును రాష్ట్రంలోని ముస్లింలు మర్చిపోయారన్నారు. ఓట్ల కోసం చవకబారు రాజకీయాలు చేస్తున్న నాయకులకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీకి క్రిస్టియన్ల మద్దతు


ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని సత్కరిస్తున్న ఏపీ క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు

బీచ్ రోడ్డు: గత ఐదేళ్లుగా మతాలు, కులాలకు అతీతంగా అర్హులకు సంక్షేమ ఫలాలు అందించిన వైఎస్సార్‌సీపీకి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే తమ మద్దతు అని ఏపీ క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ తీర్మానించింది. ఈ మేరకు తీర్మానాలతో కూడిన లేఖను వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని శుక్రవారం సిరిపురంలోని ఆమె నివాసంలో కలిసి సమర్పించారు. వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా క్రైస్తవులు పని చేస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా క్రైస్తవులకు పెద్ద పీట వేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ సర్కారని జేఏసీ చైర్మన్ డాక్టర్ సత్యానంద తెలిపారు. అనంతరం ఝాన్సీని సత్కరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ఉపాధ్యక్షుడు బిసప్ శ్యామ్యూల్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఫాగ్ కెనాన్ వాహనాల ప్రారంభం


జెండా ఊపి వాహనాలు ప్రారంభిస్తున్న పోర్టు చైర్మన్ ఎం.అంగముత్తు

విశాఖ సిటీ: కాలుష్య నివారణకు విశాఖ పోర్టు అథారిటీ పలు కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఫాగ్ కెనాన్లను అమర్చిన రెండు వాహనాలను పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు శుక్రవారం పోర్టు పరిపాలన భవనం ప్రాంగణంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరిత సాగర్-గ్రీన్ పోర్టు చర్యల్లో భాగంగా ఈ వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. పోర్టులోనే కాకుండా చుట్టు పక్కల ప్రాంతాలను సైతం పరిశుభ్రంగా ఉంచేందుకు పోర్టు కట్టుబడి ఉందని తెలిపారు. ఫాగ్ కెనాన్లను అమర్చిన ఒక్కో వాహనం కోసం పోర్టు రూ.46 లక్షలు వెచ్చిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్, ఇతర విభాగాధిపతులు, సీనియర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐపీఆర్‌లో పీజీ డిప్లమోకు దరఖాస్తుల ఆహ్వానం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సెంటర్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్న పీజీ డిప్లమో ఇన్ ఐపీఆర్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేంద్రం సంచాలకుడు డాక్టర్ హెచ్. పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 15వ తేదీలోగా ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఈ కోర్సులో ప్రవేశం పొందవచ్చునని పేర్కొన్నారు. 60 మందికి మాత్రమే ప్రవేశం కల్పిస్తామని, విద్యార్థులకు రూ.10 వేలు, ఇతరులకు రూ.15 వేలు కోర్సు ఫీజుగా నిర్ణయించినట్లు తెలిపారు. పూర్తి సమాచారం ఏయూ వెబ్‌సైట్ నుంచి గానీ, 95992 29217 ఫోన్ నంబర్‌లో గానీ సంప్రదించాలని సూచించారు.

మోదీది ప్రచార ఆర్భాటమే


మాట్లాడుతున్న శశిథరూర్

బీచ్‌రోడ్డు : పేదలకు న్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం దేశ ప్రజలంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని కేంద్ర మాజీ మంత్రి శశి థరూర్ పేర్కొన్నారు. విశాఖకు కాంగ్రెస్ పార్టీ తరుపున స్టార్ స్టార్ క్యాంపెయినర్ వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ మోదీ పాలనపై ప్రజలు విసుగు చెందారన్నారు. ప్రచార ఆర్భాటమే తప్ప మోదీ చేసిన అభివృద్ధి ఏం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు వజ్జిపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ మతం పేరుతో రాజకీయం చేస్తోందన్నారు. సోనియా, రాహుల్ గాంధీ, ఖర్గేల మార్గదర్శకంలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖ ఎంపీ అభ్యర్థి సత్యారెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ ఎంబీఏలో ప్రవేశాలకు 18 వరకు గడువు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ఐదేళ్ల బీబీఏ, ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 18వ తేదీతో దరఖాస్తు గడువు ముగియనుందని ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ విద్యార్హత ఉండి, జనరల్ అభ్యర్థులు రూ.1200, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు రూ.1000 దరఖాస్తు రుసుంగా డీడీ రూపంలో చెల్లించి పెదవాల్తేరులోని ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో అందజేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు మౌఖిక పరీక్షలు, బృంద చర్చలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 23న సీట్లు కేటాయించనున్నట్టు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు www.andhrauniversity.edu.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.

పోలీస్ కమిషనర్ పేరుతో నకిలీ కాల్ లెటర్

- కంప్యూటర్ ఆపరేటర్ పోస్టు ఉందని బురిడీ
- సీపీ రవిశంకర్ సంతకంతో నకిలీ కాల్ లెటర్
- ప్రాసెసింగ్ ఫీజు పేరుతో నిరుద్యోగి నుంచి డబ్బు వసూలు
- శ్రీకాకుళం జిల్లాకు చెందిన మోహన్‌రావు అరెస్టు


నిందితుడు మోహన్

విశాఖ సిటీ : విశాఖ నగర పోలీస్ కమిషనర్ పేరుతో నకిలీ కాల్ లెటర్ సృష్టించి నిరుద్యోగి నుంచి డబ్బులు వసూలు చేసిన ఘరానా మోసగాడిని సైబర్ క్రైమ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే... విశాఖ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఉందని నగరానికి చెందిన ఒక నిరుద్యోగికి మెసేజ్ వచ్చింది. దీంతో నిజమని నమ్మిన సదరు వ్యక్తి ఆ నంబర్‌కు సంప్రదించాడు. ఆ ఉద్యోగానికి ప్రాసెసింగ్ ఫీజు కట్టాలని, ఆ తర్వాత ఆఫర్ లెటర్ వస్తుందని ఫోన్‌లోని వ్యక్తి నమ్మించాడు. నిజమని నమ్మిన నిరుద్యోగి పలు దఫాలుగా డబ్బులు బ్యాంకు ఖాతాలో వేశాడు. అనంతరం అగంతకుడు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పేరుతో ఫేక్ ఆఫర్ లెటర్ తయారు చేసి ఫేక్ మెయిల్ ఐడీ ద్వారా నిరుద్యోగికి పంపించాడు. అలాగే పోలీస్ క్వార్టర్స్‌లో ఇంటి కోసం అడ్వాన్సు చెల్లించాలని చెప్పి ఇంకా డబ్బులు వసూలు చేశాడు. అయితే నిరుద్యోగికి అనుమానం వచ్చి తనకు తెలిసిన వారి ద్వారా వాకబు చేయగా కమిషనర్ కార్యాలయంలో అటువంటి పోస్టు లేదని తెలుసుకున్నాడు. దీంతో నిరుద్యోగి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన సైబర్ క్రైమ్ సీఐ కె.భవానీ ప్రసాద్ దర్యాప్తు చేపట్టారు. సాంకేతికత సహాయంతో నిరుద్యోగిని మోసం చేసిన వ్యక్తి శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలం జడ్యాడ గ్రామానికి చెందిన నామలాపురి మోహన్‌రావు(30)గా గుర్తించి శుక్రవారం అరెస్టు చేశారు.

ప్రయాణికుల కోసం ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం : వేసవి సీజన్‌లో ప్రయాణికుల కోసం మరికొన్ని ప్రత్యేక రైళ్లు ఆయా మార్గాల్లో నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఓ ప్రకటనలో తెలిపారు. కాచిగూడ – బ్రహ్మపూర్ (07135) సమ్మర్ స్పెషల్ కాచిగూడలో ఈ నెల 11న శనివారం రాత్రి 10.55 గంటలకు బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 12.02 గంటలకు బయల్దేరి అదే రోజు సాయంత్రం 5 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్ – కాచిగూడ (07136) సమ్మర్ స్పెషల్ బ్రహ్మపూర్‌లో ఈ నెల 12న ఆదివారం రాత్రి 10.35 గంటలకు బయల్దేరి మరుసటి రోజు తెల్లవారుజామున 3.20 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 3.22 గంటలకు బయల్దేరి మరుసటి రోజు సోమవారం మధ్యాహ్నం 4 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. చెన్నై – భువనేశ్వర్ (06107) సమ్మర్ స్పెషల్ ఈ నెల 11, జూన్ 1న ఉదయం 10. 30 గంటలకు చెన్నై ఎగ్మోర్‌లో బయల్దేరి అదే రోజు రాత్రి 10.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 10.10 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 6.30 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో భువనేశ్వర్ – చెన్నై ఎగ్మోర్ (06108) సమ్మర్ స్పెషల్ ఈ నెల 12, జూన్ 2న భువనేశ్వర్‌లో ఉదయం 9.30 గంటలకు బయల్దేరి అదే రోజు సాయంత్రం 5.10 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 5.15 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.30 గంటలకు చెన్నై ఎగ్మోర్ చేరుకుంటుంది.

◆ చెన్నై ఎగ్మోర్ – సంబల్‌పూర్ (06109) సమ్మర్ స్పెషల్ ఈ నెల 18, జూన్ 7న ఉదయం 10.30 గంటలకు చెన్నై ఎగ్మోర్‌లో బయల్దేరి అదే రోజు రాత్రి 10.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 10.10 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు సంబల్‌పూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సంబల్‌పూర్ – చెన్నై ఎగ్మోర్ (06110) సమ్మర్ స్పెషల్ ఈ నెల 19, జూన్ 8న సంబల్‌పూర్‌లో ఉదయం 11.35 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 9.30 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 9.35 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు చెన్నై ఎగ్మోర్ చేరుకుంటుంది.